# ఆదిలాబాద్-మంచిర్యాల



# సూర్య

www.suryaaa.com

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్



సోమవారం 20
మే 2024 , పేజీలు 05


## నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు

### -పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్



**మంచిర్యాల టౌన్, మే 19, సూర్య మేజర్ న్యూస్:**

నకిలీ,కల్తీ విత్తనాలను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహారంచాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఆదేశించారు.వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని,వారిని అరికట్టడంలో భాగంగా వ్యవసాయశాఖ,టాస్క్ ఫోర్స్,ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి రామగుండం పోలీస్ కమిషనరేట్ లో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నాము అని,ఈ బృందాలు రైతులను మోసం చేసే,నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి,వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తుసుకుంటామని సీపీ తెలిపారు.మంచిర్యాల జిల్లాలోగల విత్తన,ఎరువుల దుకాణాలను,గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు,అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం,రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామని కమీషనర్ తెలిపారు.లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేసే వారిపై,నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాల జారీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు, ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేస్తునమాని అన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు,మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడం,మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నకిలీ,కల్తీ విత్తనాల అక్రమ రవాణాను,సరఫరా నిరోధించేందుకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేస్తునమని,నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలుకు జాబితా కూడా సిద్ధం చేశామని సీపీ తెలిపారు.

## ఇక స్థానిక సమరం !!




- పల్లెల్లో మొదలైన సందడి
- పంచాయతీ ఎన్నికలపై నాయకుల దృష్టి

**అదిలాబాద్ మే 19 సూర్య మేజర్ న్యూస్**

లోకసభ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారా..? అనే ప్రశ్నకు అవుననే సంకేతాలు వస్తున్నాయి.లోకసభ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఈవీఎంలో పదిలమైందో లేదో .. అటు నాయకులు, ఇటు అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. లోక్సభ నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ఎన్నికల తంతు పూర్తవడంతో యంత్రాంగమంతా ఊపిరి పీల్చుకుంది. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పనులపై దృష్టి పెట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా పచ్చ జెండా ఊపినా సిద్ధంగా ఉండాలని, అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇదివరకే ఆదేశాలివ్వడంతో లోక్సభ ఎన్నికల ముందు నాలుగు జిల్లాల్లోనూ కసరత్తు జరిగింది. తాజాగా ఇదే తరహాలో జిల్లా పంచాయతీ అధికారులు గతంలో చేపట్టిన ప్రక్రియకు అదనంగా అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. తరువాయి 2లో

## బీరు సీసాతో యువకుడి మెడపై వ్యక్తి దాడి



**కడెం,19మే,సూర్య మేజర్ న్యూస్**

మద్యం మత్తులో యువకుడిపై బీరు సీసాతో ఓ వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం సాయంత్రం పెంబి మండల కేంద్రంలో జరిగింది. పెంబి ఎస్సై ఆర్. శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉట్నూర్ మండలలోని గంగాపూర్ గ్రామానికి చెందిన రాజంపేటకు చెందిన ఆత్రం సోనే రావు అనే యువకుడు శనివారం పెంబి మండలంలోని పసుపుల గ్రామానికి చెందిన కోలాంగూడకు తన బంధువులతో కలిసి వివాహానికి వచ్చాడు.వివాహ అనంతరం ఆత్రం సోనే రావు, ఆత్రం జంగు,సాకటి కైలాష్‌తో కలిసి పెంబి మండల కేంద్రంలో గల మద్యం దుకాణం వద్ద పార్టీ చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో పెంబి మండల కేంద్రానికి చెందిన పాకాల సంతోష్ వారి వద్దకు వెళ్లి ఆత్రం సోనే రావు జేబులో చేయి పెట్టగా సోనే రావు ఎందుకు చేయి పెడుతున్నావు అని అడగగా ఇద్దరి మధ్య గొడవ మొదలవగా ఆత్రం సోనే రావు మెడపై పాకాల సంతోష్ పక్కనే ఉన్న బీరు సీసాతో తీవ్రంగా దాడి చేసి పొడిచినట్లు తెలిపారు. మెడపై తీవ్రంగా గాయపడిన సోనే రావును ఆత్రం జంగు సాకటి కైలాష్‌లు చికిత్స నిమిత్తం పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన వైద్యం కొరకు ఖానాపూర్ ఆసుపత్రికి ఆ తదుపరి ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించారు.ఉట్నూర్ మండలం రాజంపెటకు చెందిన ఆత్రం సోనే రావు అనే యువకుడిని బీరు సీసాతో తీవ్రంగా గాయపర్చిన నిందితుడు పాకాల సంతోష్‌ని శనివారమే అదుపులోకి తీసుకొని హత్యాయంత్నం ఐపీసి సెక్షన్ (307) కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పెంబి ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు.




## శాంతి భద్రతలను సహకరించండి

### - ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య

**జైనూర్ మే 19 సూర్య మేజర్ న్యూస్**


జైనూర్ మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా శాంతి భద్రతలను కాపాడడం లో అన్ని వర్గాల ప్రజలందరూ సహకరించండి, దుఖానా సముదయాలను తెరుచుకోండి, మీకు పూర్తి భద్రతను కల్పించాం, అన్ని వర్గాల ప్రజలు సంనయం పాటించండి శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు సహకరించండి, చట్ట వ్యతిరేకంగా ఎవరు చేసిన, చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్న చట్ట పరమైన చర్యలు తీసుకుంటాము, పోలీసులు చేయవలసిన పని పోలీసులు తప్పకుండా చేస్తారు, ప్రజల యొక్క భద్రతే పోలీసుల మొదటి కర్తవ్యం. అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి వినతులు స్వీకరించ బడినది, పోలీసులు తీసుకోవాల్సిన అన్ని చర్యలు తప్పకుండా తీసుకుంటాము. కేసుల విషయమై ఏవన్నా సాక్షాలు ఉంటే నేరుగా సంప్రదించండి, అలాగే ఎవరి వల్లనన్న ఒత్తిడి ఉంటే పోలీసులతో నేరుగా సంప్రదించ గలరు.

## వైభవంగా కళ్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



**మందమర్రి టౌన్, మే 19, సూర్య మేజర్ న్యూస్.**

శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వర ఆలయంలో పద్మావతి శ్రీ శ్రీనివాసుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా, వేద పండితుల మంత్రోచ్చారణతో, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి ఏరియా జిఎం అయితు మనోహర్, ఆయన సతీమణి సవిత దంపతులు హాజరై, కళ్యాణ మహోత్సవంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా యజ్ఞాచార్య గోవర్ధనగిరి అనంత ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో బ్రహ్మోత్సవాలను మే 23 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎల్లందు క్లబ్ బంగ్లాస్ ఏరియాలోని సింగరేణి ఏరియా జిఎం దంపతులు అయితు సవితా- మనోహర్‌ల నివాసం నుండి ఎదుర్కోలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించామని తెలిపారు. పట్టణ ప్రజలు, భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.



# ఇక స్థానిక సమరం !!

**మొదటి పేజీ తరువాయి...**

### ఊహల్లో ఆశావహులు.....

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన ఆయా పార్టీల నాయకులు ఇప్పుడు తమ లక్ష్యమంతా స్థానిక సంస్థల్లో పోటీ చేయడమే అని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో సర్పంచికి పోటీ చేసే విషయంలో ఈ సారి గట్టిపోటీయే కనపడుతోంది. మూడు ప్రధాన పార్టీల మద్దతుతో బరిలో నిలవాలనుకునే వారు ఆశలలోకంలో విహరిస్తున్నారు. గతంలో పోటీ చేసి ఓడిపోయిన వారితోపాటు కొత్త వాళ్లు ఈ పదవిపై కన్నేస్తున్నారు. ఇందుకోసం ఏ పార్టీ మద్దతు ఉంటే తమకు లాభం ఉంటుందనే విషయమై ఇప్పటికే అంచనాకు వచ్చి మొన్నటి ఎన్నికల్లో కొందరు పార్టీలు మారారు. ఈ ఎంపీ ఎన్నికల ఫలితాల తరువాత పార్టీల మార్పు కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు పార్టీల బీ-ఫారాలు అవసరం ఉండటంతో కొందరు నాయకులు ఇప్పటి నుంచే తమ పార్టీ ముఖ్యులను కలుస్తూ శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో తాము కష్టపడిన తీరుని వివరిస్తూ మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపైనే అందరి దృష్టి మళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడం..రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి అన్నట్లు గ్రామాల్లో పరిస్థితి ఉంది.



### క్షేత్రస్థాయిలో కోలాహలమే....

వరుసగా శాసనసభ, లోక్సభ ఎన్నికలు ముగియడంతో ఇక తమ వంతు అని గ్రామస్థాయి నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వచ్చే నెల 4వ తేదీన వెలువడే లోక్ సభ ఎన్నికల ఫలితాల తరు వాత కోడ్ ముగియనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కూడా లోక్ సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహిస్తామని ప్రకటన చేసింది. ఇదే జరిగితే వచ్చే మూడు నెలలపాటు జిల్లాల్లో ఊరూరా కోలాహలమే కనిపించనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మొదట సర్పంచి ఎన్నికలను నిర్వహించాల్సి వస్తే అదిలాబాద్ జిల్లాలోని ఉన్న 474 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు జరిపే అవకాశముంది. దీంతో కొత్తగా ఏర్పాటైన భీంపూర్,సిరికొండ,మండలాల్లో కొత్తగా ఎంపీపీ, జడ్పీటీసీలు తొలిసారిగా ఎన్నికయ్యే అవకాశం వచ్చే ఎన్నికల్లో ఉండనుంది. అదిలాబాద్ జిల్లాలో 9 మండలాల, క్షేత్రస్థాయిలో సందడి నెలకొననుంది. పోలింగ్ కేంద్రాల విషయంలో కొంత స్పష్టత రావడంతో బ్యాలెట్ డబ్బాలు ఇతరత్రా ఏర్పాట్ల కోణంలో తగుశ్రద్ధను కనబరుస్తున్నారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాల నుంచి రిజర్వేషన్ల జాబితాను పంపించారు. గత ఎన్నికల్లో అవలంబించిన విధానాలు, స్టేషనరీ ఇతర ఖర్చు మొదలగు సమాచారాన్ని నివేదిక రూపంలో అందజేశారు.

### పాత రిజర్వేషన్లేనా....?

2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1, 2024 తో పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గత ఎన్నికల సమయంలో కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం అమలులో ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పాత విధానాన్నే కొనసాగిస్తారా? మార్పులు ఏమైనా ఉంటాయా.. అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. చట్టాన్ని సవరించకుండా పాత విధానాన్నే కొనసాగిస్తే ఇప్పుడు రిజర్వుడు స్థానాల్లో సర్పంచిగా ఉన్నవారు మరోసారి పోటీలో ఉండనున్నారు. కొత్త వారు కూడా బరిలో ఉంటారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైతే గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కనున్నాయి. పదవులను ఆశిస్తున్న వారు ఇప్పటికే ఓటర్లను తమ వైపునకు తిప్పుకొనే ప్రయత్నాలు ప్రారంభించారు.

### అధికారులు, సిబ్బంది నియామకం కీలకం....

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారుల నియామకానికి మార్గదర్శకాలను గతేడాది డిసెంబరులోనే రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకాలను చేపట్టాల్సి ఉంది. జిల్లాలో 474 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి ఒకరు చొప్పున స్టేజ్-1 అధికారి ఉంటారు. వీరు నామినేషన్ల స్వీకరణ నుంచి గుర్తులు కేటాయించే వరకు పనులు ౧ చూసుకుంటారు. స్టేజ్-2 అధికారులు పోలింగ్ ప్రక్రియను నిర్వహిస్తారు. వీరితోపాటు పోలింగ్ సిబ్బంది కూడా ఉంటారు. పంచాయతీల వారీగా వీరిని గుర్తించేందుకు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో 200 మంది వరకు ఓటర్లు ఉంటే ప్రిసైడింగ్ అధికారితోపాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201-400 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, 401-650 మంది ఓటర్లు ఉంటే ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. 650 మందికంటే ఎక్కువ మంది ఓటర్లు నియమిస్తారు. 650 మందికంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఎన్నికల సిబ్బందికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే పూర్తి చేశారు. ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు రాగానే వీరికి ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వనున్నారు.

# పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

**- పట్టించుకోని అధికారులు**
**- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు**

**శ్రీరాంపూర్, మే 19, సూర్య మేజర్ న్యూస్:**



నస్పూర్ పట్టణ పరిధిలోని 11 వ వార్డు ఎస్ఎల్ఆర్ కాలనీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండి ఉండడంతో డ్రైనేజీ నీరు రోడ్డుపై నుండి ప్రవహిస్తుంది. దీంతో రోడ్డుపై నుండి వెళ్లే వాహనదారులు బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి నీరు రోడ్డుపై నుండి వచ్చి పలు ఇళ్ళముందట నిలిచి ఉంటుంది దీంతో మురుగనీటి నుండి దుర్వాసన ఇళ్ళలోకి చేరుతుంది. 3 నెలలు కావస్తున్న కాల్వలోని పూడికలు తీయకుండా ఉండడంతో మురుగనీరు, చెత్తాచెదారంతో పేరుకుపోయి దుర్వాసనతో ఉంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.




## దళితుల భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు**



**ఆసిఫాబాద్ ప్రతినిధి 19 మే సూర్య మేజర్ న్యూస్**

అమాయకమైన దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో బాధితులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలమానపల్లి మండలం బాలాజీ అనుకోడా, రేణవెల్లి శివారులో శంకరయ్య సూర్యాదాస్ ,కొండయ్య, సోమయ్య, ఋషి , విజయ్ చెందిన దాదాపు 40 ఎకరాల భూమిని నాన్నయ్య, చిన్నక్క, ప్రేమ్ కుమార్, నాగేశ్వరరావు, జయపాల్, పురుషోత్తం అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. బాధితులు తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమించుకున్న పెత్తందారులు దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. లావుని పట్టాలను భూ యజమానులకు యజమానులకు తెలవకుండానే అధికారులు కబ్జాదారులు ఒకటై పట్టాలను అక్రమంగా చేసుకున్నారని వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేసేందుకు సమగ్ర విచారణ చేసి అర్హులైన వారికి పట్టాలు అందజేయాలని వారి భూములను వారికి చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు శంకర్ , బాధితులు శంకరయ్య, సూర్యాదాస్, విజయ్, సోమయ్య, ఋషి, కొండయ్య ,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో**

# అవగాహన సదస్సులు

**లక్ష్మణ చాంద,మే 19,సూర్య మేజర్ న్యూస్,**

మండలంలోని రాచాపూర్, చామనపల్లి గ్రామాల్లో నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఆదివారం రోజున రాబోయే స్థానిక ఎన్నికల గురించి ఓటు హక్కు వినియోగం పై పోలీస్ శాఖ వారు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు ఇతర వ్యక్తులకు వారి ప్రశాంతతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే పోలీసు వారు వారిపై కఠిన చర్యలు తీసుకొని బైండోవర్ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వాటి ప్రాధాన్యత గురించి గ్రామస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి





**లోకేశ్వరం,మే 19,సూర్య మేజర్ న్యూస్**

లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శి నారాయణ,టీఏ మంజుల, ఎఫ్ ఏ సాయన్న లు పరిశీలించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న సందర్భంగా ఉపాధి హామీ కూలీలు ఉదయం తొందరగా వచ్చి ఉపాధి హామీ పనులను ముగించుకొని 10 గంటల లోపే ఇంటికి చేరుకోవాలని సూచించారు.వడ దెబ్బ బారిన పడకుండా కూలీలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

## నిర్మల్ జిల్లా ఎస్పీని కలిసిన డీఆర్డీఓ విజయలక్ష్మి



**నిర్మల్ ,మే 19, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో తయారుచేసిన ధాన్యం కుచ్చులను ప్రతి ఒక్కరు కొనుగోలు చేయాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, మండల సమాఖ్య ఆధ్వర్యంలో తయారుచేసిన వరి ధాన్యం కుచ్చులను ఆదివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు డీఆర్డీఓ విజయలక్ష్మి అందించారు. వీటిని కావాలనుకునేవారు 9652004859,9949123090 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నిర్మల్ ప్రతినిధి ,మే 19, సూర్య మేజర్ న్యూస్**

సోన్ జడ్పీ హైస్కూల్ లో 1997-98 సంవత్సరములో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్మల్ లో నిర్వహించారు.అప్పటి అనుభవాలు, అనుభూతులను విద్యార్థులు మననం చేసుకొన్నారు. బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు. చదువుకున్న రోజులలోని సంగతులను తమ ప్రసంగాల్లో వివరించారు.25ఏండ్ల తరువాత కలుసుకొని ఆనందానుభూతిని పంచుకొన్నారు.



## డిగ్రీ చదువు తోపాటు ఉద్యోగము సెలక్షన్స్ పూర్తి

**మంచిర్యాల టౌన్,మే 19,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ,పీజీ కళాశాలలో ఉద్యోగ ఎంపిక కార్యక్రమం చేపట్టారు.ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపులో 60 శాతం మార్కులతో ఈ సంవత్సరం పాసైన విద్యార్థులకు ఎంఎస్ఎన్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఉద్యోగంతో పాటు ఉచిత విద్య అందించే నిమిత్తం ఆదివారం అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ,ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్, సింగరేణి మాస్టర్ మోటివేటర్స్ బృందం,వివేకవర్ధిని విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి.మంచిర్యాల జిల్లా, ఆసిఫాబాద్ జిల్లా నుండి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉచిత విద్య, భోజనము, వసతితోపాటు



జీతంతో కూడిన ఉద్యోగం కోసం జరిగిన సెలక్షన్లో 10 మంది విద్యార్థులు అర్హత పొందారని వారికి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో అభినవ సంతోష్ కుమార్,ఏ నవీన్ రెడ్డి ,మాస్టర్ సతీష్,కేశెట్టి సాయినాథ్ ,కాసం ఆకాష్ , ప్రిన్సిపాల్ మణిబాల తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో వైశాఖమాస పూజ



**భైంసా,మే 18,సూర్య మేజర్ న్యూస్**

కుభీర్ గ్రామంలోని పెద్ద హనుమాన్ మందిర్ నందు అనవాయితీగా వస్తున్న చైత్ర హనుమాన్ జయంతి నుంచి వైశాఖ పౌర్ణమి వరకు ప్రతి రోజు సా.7 గం.లకు ఆంజనేయ స్వామి అభిషేకం జరుగును.శనివారం సందర్భంగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల చైర్మేన్ సాప పండరి దంపతులు ఆలయ వేద పండితులు ప్రమోద్ మహారాజ్ జ్యోషి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి అభిషేకము పూజా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గోన్నారు.

## శ్రీఆంజనేయ కాలభైరవ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

**నిర్మల్ ,మే 19, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్థానిక చింతకుంటవాడలో శ్రీఆంజనేయ కాలభైరవ యూత్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా పొగుల హరీష్, ఉపాధ్యక్షుడిగా మరిపెద్ది మహేష్, ప్రధాన కార్యదర్శిగా బద్రి సాయి, కోశాధికారిగా మునిగెల మనీష్ ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.



## పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి



**ఆసిఫాబాద్ ప్రతినిధి 19 మే సూర్య మేజర్ న్యూస్**

దక్షిణ భారత దేశ కమ్యునిస్టు ఉద్యమ నిర్మాత వీర తెలంగాణ సాయుధ రైతంగా పోరాట రథసారది కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కన్వీనర్ దుర్గం.దినకర్ మాట్లాడుతూ సుందరయ్య చిన్నతనంలో అసమానతలకు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా 1932లో వ్యవసాయ కార్మిక సంఘం స్తాపించి తన ఇంటినుండే పోరాటం మొదలు పెట్టారు. సుందరయ్య నిరాడంబర జీవి దేశానికే గొప్ప ఆదర్శ నాయకుడు.భూస్వాముల (రెడ్డి)కుటుంబంలో జన్మించిన సుందర్ రాంరెడ్డి పేరు తీసీ వేసి సుందరయ్యగా పేరు మార్చుకుని తన యావత్ ఆస్తి ని అంతా పేద ప్రజలకు పంచి పిల్లలు పుడితే స్వార్థం ఏర్పడుతుందని ముందే తన భార్య లీలావతి తో మాట్లాడి పిల్లలు కాకుండా ఆపరేషన్ చేసుకొని దేశంలో వున్న పేద ప్రజలే తన పిల్లలుగా భావించి త్యాగం చేసిన గొప్ప కమ్యునిస్టు నాయకుడు సుందరయ్య .అసెంబ్లీ పార్లమెంటుకి సైకిల్ మీద వెల్లిన నీడారంబర జీవి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఏరియా కమిటీ సభ్యులు గేడం.టీకనంద్.మలశ్రీ.జడి.తిరుపతి.వడ్లారు.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కుభీర్ స్మశాన వాటికలో తప్పని తిప్పలు

**కుబీర్,మే 19,సూర్య మేజర్ న్యూస్**

కుభీర్ గ్రామంలోని స్మశాన వాటిక గతంలో రాళ్లు,ముండ్ల పొదలతో నిండి ఉండగా,వర్షకాల సమయంలో నడవడానికి వీలు లేకుండ వుండడంతో సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మేన్ సాప పండరి నిర్మల్ జిల్లా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి సిమెంట్ ఫ్లోరింగ్ 50/60 పొడవు,వెడల్పులతో వేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుబీర్ స్మశాన వాటికలో వాటర్ సౌకర్యం,గేటు అనేవి చేసినప్పటికి మధ్యలోనే ఆపివేశారని అన్నారు.అలాగే వెంటనే స్నానపు గదులు,వాటర్ సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు.గత కొన్ని రోజుల క్రితం నూతనంగా వేసిన సిమెంట్ ఫ్లోరింగ్ పై పశువులు మల, మూత్ర విసర్జన చేయడంతో అధ్వానంగా తయారిందని అన్నారు.వెంటనే గ్రామ పంచాయితీ సిబ్బంది కుబీర్ స్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ ను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని కోరారు.వీరితోపాటుగా కుబేర్ గ్రామస్తుడు సిలారి గణేష్ తదితరులు ఉన్నారు.



సూర్య
సోమవారం 20 మే 2024

## విశ్వతేజ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ అవార్డు అందుకున్న వాడేకర్ లక్ష్మణ్

**భైంసా,మే 19,సూర్య మేజర్ న్యూస్**

విశ్వతేజ ట్రైనింగ్ కౌన్సెలింగ్ సర్వీసెస్ నిజామాబాద్ వారు కపిల హోటల్ లో రెండు రోజులు ప్రైవేటు పాఠశాలల మేనేజ్మెంట్,ప్రిన్సిపాల్ లకు వర్క్ షాప్ నిర్వహించారు.ఇందులో భాగంగా భైంసా పట్టణానికి చెందిన ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ గత రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు వ్యక్తిత్వ




వికాసం పై శిక్షణ తరగతులు,ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు.వారు చేస్తున్న సేవలకు గాను విశ్వతేజ మాస్టర్ ట్రైనర్ అవార్డు ను విశ్వతేజ ఫౌండర్ శ్రీహరి తిరునగరి,కామారెడ్డి సాందీపని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ ప్రసాద్ రావు అందచేశారు.ఈ సందర్భంగా వాడేకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ తనకు ఈ విశ్వతేజ అవార్డు దక్కడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.అలాగే అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వేదం విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,లిడ్ ఇండియా ట్రైనర్ దశరథం రెడ్డి,స్పీకర్ మహిపాల్,వాజ్ఞామహేందర్, తెలంగాణ,ఆంధ్ర నుంచి వచ్చిన ప్రైవేట్ స్కూల్ యజమాన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**-తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి**
**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి**

**భైంసా,మే 19,సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ముందు సమగ్ర కులగణన చేసి బీసీ ల కిచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని,అలా జరగని ఎడల బీసీ లకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డ్ మెంబర్ గా లేని కులాలు ఎన్నో ఉన్నాయని,ఇలాంటి వర్గాలవారందరికీ న్యాయము జరిగే విధంగా బీసీలో ఏ. బి.సి.డి. వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు జరిపితే బీసీలోని అన్ని వర్గాల వారికి న్యాయము జరుగుతుందని ఆయన పాత్రికేయుల సమావేశంలో తెలిపారు.



## ఆ 'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం

**వాంకిడి, మే 19,సూర్య మేజర్ న్యూస్**

వాంకిడి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988లో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన మిత్రులంతా ఒక చోట చేరి గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొక్కరు ఆత్మీయతతో పలకరించుకుని ప్రస్తుత జీవన స్థితి గతులను పంచుకున్నారు. ఆపద సమయాల్లోను స్నేహితులం ఒకరికొకరు తోడుగా నిలుద్దామని మాట్లాడుకున్నారు. కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించి రోజంతా ఆనందంగా గడిపారు. విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు లచ్చిరెడ్డి, సాంబయ్యలను కృతజ్ఞతా పూర్వకంగా శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1988 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ శిక్షణను సద్వినియోగపరచుకోండి



**మందమర్రి టౌన్, మే 19, సూర్య మేజర్ న్యూస్.**

బాక్సింగ్ శిక్షణ అనేది మీ శారీరక దృఢత్వాన్ని మెరుగు పరచడానికి ఎంతో ఉపయోగపడుతుందని, పట్టణ ప్రజల సౌకర్యార్థం మందమర్రి గ్రేస్ లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో



వారియర్స్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాక్సింగ్ క్రీడ శిక్షణ శిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగపరచుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సూచించారు. ఆదివారం శిబిరం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాక్సింగ్ క్రీడకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని, పట్టణంలో బాక్సింగ్ శిక్షణను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపి, జాతీయ, రాష్ట్ర స్థాయిలో జిల్లాకు, పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పట్టణ పరిసర ప్రాంత క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బాక్సింగ్ క్రీడా సెల్ఫ్ డిఫెన్స్ కు ఉపయోగపడుతుందని, కష్టపడితే జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని తెలిపారు. క్రీడాకారులు క్రీడలు చక్కటి వాతావరణంలో నేర్చుకోవాలని సూచించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్, వారియర్స్ బాక్సింగ్ అకాడమీల సంయుక్త నిర్వహణలో శ్రీకాంత్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి బాక్సింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి, బాక్సింగ్ క్రీడను ప్రతి గ్రామానికి చేరే విధంగా తయారు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు లభిస్తే, మంచి ఫలితాలు తీసుకొచ్చి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నిట్టూరి మైసూర్, అధ్యక్షులు పాదం రవీందర్, కార్యదర్శి బోయిని రాజ్ కుమార్, కోచ్ జగత్ సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద తిరుమల్ రెడ్డి, గుడ్ల రమేష్, ఎర్ర రాజు, మూదారపు శేఖర్, సునార్కర్ రాంబాబు, సంగిసది, పాషా, రాజేష్, అఖిల్, నిశాంత్, కిట్టు, అన్సర్, సాయి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## దేగాం గ్రామంలో ఘనంగా పెద్దమ్మ తల్లి పండగ



**భైంసా,మే 19,సూర్య మేజర్ న్యూస్**

భైంసా మండలం దేగాం గ్రామంలో పెద్దమ్మ తల్లి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ మహిళలు నెత్తిన బోనాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**నిర్మల్ ,మే 19, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులపై స్థానిక కౌన్సిలర్ తో చర్చించారు. త్వరలోనే కాలనీలో సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతామని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలంలో కాలనివాసులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నిర్మల్ ,మే 19, సూర్య మేజర్ న్యూస్**

ఏఎన్రెడ్డి జూనియర్ కాలేజ్ 1996 - 98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల అనంతరం విద్యార్థులు ఒకచోట కలుసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులు శంకర్, ప్రకాశ్, చిన్నయ్య, రాంచందర్, నాగేశ్వరరావు,రాజ రమేష్ లెక్చరర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఆర్య సమాజం ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞం



**నిర్మల్ ,మే 19, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ పట్టణంలోని నాయుడు వాడలోని ఆర్యసమాజ మందిరంలో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు.ఈ యాగం విశ్వశాంతికి, మానవతకి మార్గం చూపుతుందని పలువురు అన్నారు. శాకాహారం ప్రాముఖ్యతను పురోహితుడు శ్రీకాంత్ ఆర్య తెలిపారు. ఇందులో డాక్టర్ కూన ప్రవీణ్, సర్సారెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, చంద్రశేఖర్, నాయిడి రమేష్ ఉన్నారు.

## చేపల వేటకు వెళ్లి కుంటలో పడి వ్యక్తి మృతి

**పెంబి, మే,19,సూర్య మేజర్ న్యూస్:**

చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పెంబి మండలంలోని ఇటిక్యాల గ్రామంలో జరిగింది. పెంబి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంచు లస్మయ్య శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో అదే గ్రామంలో ఉన్న మూల కుంట చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడు కుమారుడు ఆదివారం ఉదయం కుంటలో చూడగా మృతదేహం కనిపించినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య సుంచు నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.



# పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి వేడుకలు

**- సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు సిద్ధం కావాలి**

**- దుంపల రంజిత్ కుమార్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు**

**దండేపల్లి,19మే,సూర్య మేజర్ న్యూస్ :**

దండేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 39 వర్ధంతి కార్యక్రమం కోయపోచం గూడెం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుంపల రంజిత్ కుమార్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య 1985 మే 19వ తేదీన తుదిశ్వాస విడిచారు.ఆయన జీవించిన కాలమంతా సమాజానికి మార్గదర్శకంగా నిలిచారు. నాటి కాలంలో రాజకీయాల్లో ఒక కొత్త మార్గాన్ని చూపారు. రాజకీయ నాయకుడంటే ఎలా ఉండాలో ఒక నమూనాగా నిలిచారు. భారత దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారు. అందుకోసం తన యావజ్జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం వీరు తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటని ముందు ఉండి నడిపించి 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, పదివేల గ్రామాలలో గ్రామ రాజ్యాలు నిర్మించిన యోదుడు కామ్రేడ్ సుందరయ్య అని తెలిపారు. నేటికీ ఇంటి జాగలు లేనిపేదలు మరియు దున్నుకోవడానికి సాగు భూమి



లేనటువంటి దళిత, ఆదివాసి, బలహీనవర్గాల ప్రజలకు ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని అందుకోసం సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని భూ ఉద్యమాలు,ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇచ్చే విదంగా పోరాటాలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లచ్చగౌడ్ పార్టీ మండల సీనియర్ నాయకులు, రాజలింగు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు,కోయపోచం గూడెం పార్టీ శాఖ కార్యదర్శులు రమేష్, ఎల్లయ్య, మహేశ్వరీ, శ్యామల, తారభాయ్, మద్దికుంట బాపు, వెంకటేష్, సునీత, గంగామణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి ఎర్ర రక్త కణాలు దానం చేసిన సోహెల్




**భైంసా,మే 19,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని ఆదర్శ హాస్పిటల్‌లో అనుమవ్వ అనే పేషంట్ కు డెలివరీ సమయంలో ఆపరేషన్ కొరకు బి పాజిటివ్ రక్తం తక్కువయింది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది సురేష్ వాట్సాప్ బ్లడ్ డోనర్స్ గ్రూపుకు సమాచారం అందించారు.వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం తెలుసుకున్న దేగాం గ్రామానికి చెందిన సోహెల్ అనే యువకుడు స్పందించి స్పందించి రక్తనిధి కేంద్రానికి వచ్చి బి పాజిటివ్ ఎర్ర రక్త కణాలను దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా బ్లడ్ డోనర్స్ గ్రూప్ అడ్మిన్ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శేఖర్,ప్రవీణ్,అక్షయ్ తదితరులు ఉన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని కరీంనగర్ జిల్లాకు చెందిన వృద్ధురాలి మృతి

**మందమర్రి టౌన్, మే 19, సూర్య మేజర్ న్యూస్.**

జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని



వాహనం డీ కొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మందమర్రి పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై రాజశేఖర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాలకు చెందిన కురుమ రాధమ్మ(60) తన అల్లుడి దశదిన కర్మ కోసం శనివారం పట్టణానికి రాగా, యాపల్ ఏరియాలోని ఇల్లందు క్లబ్ బస్సు స్టాప్ లో బస్సు దిగి, జాతీయ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రాధమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## పల్సి గ్రామంలో ఉచిత పిల్లల ఆరోగ్య శిబిరం

**కుబీర్,మే 19,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణ ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు బందేల నరేష్





ఆధ్వర్యంలో కుబీర్ మండలం పల్సి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో చిన్న పిల్లల ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చిన్న పిల్లలను ఆరోగ్యపరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.కార్యక్రమం అనంతరం ఆయనను గ్రామ సభ్యులు పుష్పగుచ్ఛంతో అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టే హన్మాండ్లు,సర్పంచ్ రాజు, వీడీసీ అధ్యక్షులు నిమ్మ లక్ష్మణ్,సర్పంచ్ దత్తురాం,కుబీర్ మండల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ రాజన్న, గ్రామ యువ నాయకుడు సబ్బిడి రాజు,కుబీర్ మార్కెట్ డైరెక్టర్ మెంచు రాములు,యువ నాయకులు సతీష్,గ్రామ యువకులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ 'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం

**వాంకిడి, మే 19,సూర్య మేజర్ న్యూస్**

వాంకిడి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988లో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా



వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన మిత్రులంతా ఒక చోట చేరి గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొక్కరు ఆత్మీయతతో పలకరించుకుని ప్రస్తుత జీవన స్థితి గతులను పంచుకున్నారు. ఆపద సమయాల్లోను స్నేహితులం ఒకరికొకరు తోడుగా నిలుద్దామని మాట్లాడుకున్నారు. కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించి రోజంతా ఆనందంగా గడిపారు. విద్యా బుద్ధులు నేర్చిన ఆనాటి ఉపాధ్యాయులు లచ్చిరెడ్డి, సాంబయ్యలను కృతజ్ఞతా పూర్వకంగా శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1988 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ విచారణ పేరుతో వేధింపులకు గురి చేస్తే సహించేది లేదు

**- ఏఐటీయూసీ యునియన్ నాయకులు**

మందమర్రి టౌన్, మే 19, సూర్య మేజర్ న్యూస్.

సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ విచారణ పేరుతో అధికారులను, కార్మికులను వేధింపులకు గురి చేస్తే సహించేది లేదని, మితిమీరుతున్న విజిలెన్స్ ఆగడాలను అరికట్టాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మందమర్రి పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైపూర్ లోని ఎస్టిపిపి లో విజిలెన్స్ వేధింపులు భరించలేక అధికారి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, అధికారులు కానీ, కార్మికులు కానీ విజిలెన్స్ అధికారులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేయడం, రహస్య ప్రదేశాలలో విచారణ పేరుతో వారిని అవమానపరిచేలా వ్యవహరించడం సరైనది కాదన్నారు. సామాన్య అధికారులను, కార్మికులను ఇబ్బందులకు, వేదింపులకు గురి చేసే విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి సింగరేణిలో జరుగుతున్న వేల కోట్ల రూపాయల పెద్దపెద్ద కుంభకోణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అదేవిధంగా ఏరియాలోని కార్మిక కాలనీలలో అంతర్గత బీటీ రోడ్లు వేయడంలో సింగరేణి ఏరియా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని, ఏరియాలోని అంతర్గత బీటీ రోడ్లు కంకర తేలి, ప్రజలు నడవడానికి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని, వెంటనే రోడ్లను తిరిగి మరమ్మతులు చేసి, కొత్త రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. గత రెండు, మూడు నెలల క్రితం ఏరియాలోని 3వ జోన్ లో రోడ్లు వేశారని, మిగిలిన 1,2 జోన్లలో ఇంతవరకు రోడ్లు పనులు మొదలుపెట్టలేదన్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్నందున వర్షాలు పడితే రోడ్ల పనులు నిర్వహించరాదని, సింగరేణి యాజమాన్యం, సివిల్ అధికారులు త్వరితగతిన స్పందించి, అంతర్గత బిటి రోడ్లు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియాలోని ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.